



# ఐక్యంగా ఉందాం.. అనుకున్నది సాధిద్దాం

**షాద్ నగర్ సీనియర్ జర్నలిస్టులు**

**షాద్ నగర్ లో ప్రింట్ మెయిన్ స్ట్రీమ్ మీడియా ముఖ్య సమావేశం..**

**షాద్ నగర్ కన్వీనర్‌గా మిద్దెల సత్యనారాయణ, కో కన్వీనర్లుగా లక్కాకుల రమేష్, శ్రీశైలం**

వాయిస్ టుడే /షాద్ నగర్ /జులై 20: షాద్ నగర్ పరిధిలో పనిచేస్తున్న ప్రింట్ మీడియా మెయిన్ స్ట్రీమ్ కలిసికట్టుగా ఉండి సమస్యలను సాధించుకోవాలని సీనియర్ జర్నలిస్టులు లట్టుపల్లి మోహన్ రెడ్డి, ఎండి ఖాజాపాషా (కేపీ), కస్తూరి రంగనాథ్, సత్యనారాయణ, శరత్, సంజీవ్ కుమార్, రాఘవేందర్ గౌడ్ తదితరులు పిలుపునిచ్చారు. షాద్ నగర్ పట్టణంలో ప్రింట్ మీడియా మెయిన్ స్ట్రీమ్ సమావేశం శనివారం దేవి గ్రాండ్ హోటల్లో జరిగింది. ఈ సందర్భంగా త్వరలో కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కమిటీ ఏర్పాటుకు సంబంధించి కన్వీనర్ గా సీనియర్ పాత్రికేయుడు మిద్దెల సత్యనారాయణ, కో కన్వీనర్లుగా లక్కాకుల రమేష్, శ్రీశైలంలు ఎంపికయ్యారు. వీరి ఆధ్వర్యంలో ప్రింట్ మీడియాలో ప్రభుత్వ గుర్తింపు కార్డు కలిగిన పాత్రికేయుల జాబితా ఏర్పాటు చేయడం జరుగుతుందని వారు వివరించారు. అనంతరం కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని వారు వెల్లడించారు. దీనికి సంబంధించిన సమావేశాన్ని త్వరలో నిర్ణయించనున్నట్లు తెలిపారు. మలిదశ సమావేశం ఈనెల బుధవారం 24న చేపడుతున్నట్టు వారు పేర్కొన్నారు. పాత్రికేయ విలువలు దిగజారుతున్న తరుణంలో వాటికి సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకోవాలో తాత్కాలిక కమిటీ ఆధ్వర్యంలో చర్చించారు. కొంతమంది గ్రూపులుగా తయారై మీడియా విలువ దిగజార్చే విధంగా వ్యవహరిస్తున్నారని అలాంటి వారిపై అవసరమైతే చర్యలు తీసుకోవడానికి కూడా వెనకాడ బోమని నూతన కమిటీ కన్వీనర్ సత్యనారాయణ హెచ్చరించారు. వృత్తికి సంబంధం లేని వారు కూడా ఇక్కడ వసూళ్ల పర్వాన్ని కొనసాగిస్తున్నారని దీనివల్ల నిజాయితీగా పనిచేసే మరెందరో జర్నలిస్టులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇచ్చి ప్రజల సేవ కోసం వృత్తిని అంకితభావంగా భావించాలని చెబితే కొంతమంది సొంత ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారని ఇది తగదని కన్వీనర్ సత్యనారాయణ తెలిపారు. ఇకపై కొత్త కమిటీ అయ్యాక ఇలాంటి ఫేక్ మీడియా పేరిట చలామణి అవుతున్న వారిని ఏరిపారేస్తామని హెచ్చరించారు. సమాజంలో ఎంతో విలువలతో కూడుకున్న పాత్రికేయ వృత్తిని నీరుగారుస్తూన్న వారిని ప్రింట్ మీడియా పేరుతో వసూళ్ల పర్వానికి తెర లేపిన వారిని ఉపేక్షించబోమని జర్నలిస్టు సత్యనారాయణ తెలిపారు. త్వరలోనే కమిటీని ఏర్పాటు చేయబోతున్నట్టు తెలిపారు.

భవిష్యత్తు ప్రణాళికల దృశ్య మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని త్వరలోనే కమిటీ ఏర్పాటు చేసి యూనియన్లకు అతీతంగా చర్యలు చేపట్టబోతున్నామని పలువురు జర్నలిస్టులు తమ అభిప్రాయాలు తెలిపారు. సీనియర్ పాత్రికేయులు కేపి, మోహన్ రెడ్డి, సంజయ్ కుమార్, కస్తూరి రంగనాథ్, సరాపు రమేష్, కృష్ణ, శరత్, రాఘవేందర్, సురేష్, లక్కాకుల రమేష్ కుమార్, రాజశేఖర్ గౌడ్,నరేష్,రమేష్(దిశ), నరేందర్,నరసింహారెడ్డి, ఆర్షత్, మోయిజ్,లక్కాకుల కిరణ్, నరేందర్,దర్మపాల్, పాల్గొన్నారు.

## జూకంటికి దాశరథి పురస్కారం

**ప్రకటించిన సర్కారు**

**మూడు దశాబ్దాల సాహితీ సేవకు గుర్తింపు**



హైదరాబాద్, సిరిసిల్ల: ప్రతిష్ఠాత్మక దాశరథి కృష్ణమాచార్య పురస్కారం మట్టి కవిగా ఖ్యాతి గడించిన జూకంటి జగన్నాథాన్ని వరించింది. ప్రభుత్వం నియమించిన కమిటీ నిర్ణయం మేరకు శనివారం సర్కారు ఈ ఏడాదికి గాను ఆయనకు అవార్డును ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పురస్కారంతో పాటు లక్షా వెయ్యి నూట పదహారు రూపాయల నగదు, జ్ఞాపికను అందజేస్తారు. ఈ సందర్భంగా జగన్నాథంకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ నెల 24న హైదరాబాద్‌లో ఆయనకు అవార్డు ప్రదానం చేయనున్నారు. 16 కవితా సంకలనాలు: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లిలో 1955లో జన్మించిన జూకంటి జగన్నాథంను సన్నిహితులు మట్టి కవి అని పిలుస్తారు. మూడు దశాబ్దాల ఆయన కవితా ప్రస్థానం ప్రజలను మేల్కొలిపేలా సాగింది. 1993లో ఆయన సాహితీ ప్రస్థానం ప్రారంభించి ఇప్పటికి 16 కవితా సంకలనాలు వెలువరించారు. 2007–2013ల మధ్య తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షునిగా వ్యవహరించారు. 2014 నుంచి ప్రస్తుతం అఖిల భారత తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. శ్రమదోపిడీ, రాచరిక వ్యవస్థ, ప్రభుత్వ వైఫల్యాలను తన కవితలు, రచనల ద్వారా ఎండగట్టారు. ప్రపంచీకరణపై మొదట్లోనే నిరసన గళం విప్పిన కవి ఆయన. స్థానిక మాండలికంతో సాగే ఆయన కవితలు కన్నడ, తమిళ, హిందీ, ఆంగ్ల భాషల్లోకి అనువాదమయ్యాయి. ఇప్పటి వరకు జూకంటి 11 పురస్కారాలు పొందారు. అందులో తెలంగాణ ఉత్తమ సాహితీవేత్త అవార్డు, సినారె కవితా పురస్కారం ఉన్నాయి.




## స్టాఫ్‌నర్సుల బదిలీల్లో ప్రతిష్టంభన

సుల్తాన్‌బజార్: వైద్యారోగ్య శాఖలో స్టాఫ్‌నర్సుల సాధారణ బదిలీల్లో ప్రతిష్టంభన నెలకొంది. తప్పులతడకగా రూపొందించిన సీనియారిటీ జాబితాను సరిచేసి, పదోన్నతులు ఇచ్చిన తర్వాతే బదిలీలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తూ శనివారం కోఠిలోని ప్రజారోగ్య శాఖ సంచాలకులు(డీహెచ్), ఉస్మానియా వైద్య కళాశాల (ఓఎంసీ) కౌన్సెలింగ్ కేంద్రం వద్ద ఆందోళనలతో హోరెత్తించారు. వర్షంలోనూ నిరసన కొనసాగించారు.

శుక్రవారం కౌన్సెలింగ్ వాయిదా వేయడంతో శనివారం ఉదయమే స్టాఫ్‌నర్సులు కోఠి డీఎంహెచ్‌ఎస్ ఆవరణలోని డీహెచ్ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికి ఉన్నతాధికారులెవరూ అందుబాటులో లేరు. శనివారం సాయంత్రం వరకు కూడా ప్రక్రియ ప్రారంభించకపోవడంతో తీవ్ర అసహనానికి గురయ్యారు. పదోన్నతులు కల్పించిన తర్వాతే బదిలీల ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. ఉపాధ్యాయులకు, వైద్యులకు పదోన్నతులు కల్పించాకే బదిలీలు చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. తమలో చాలామందికి ముప్పై ఏళ్ల సర్వీసున్నా... పదోన్నతులు లేకుండానే ఉద్యోగ విరమణ చేస్తున్నారని వాపోయారు. బదిలీలు జరిగిన నెల రోజుల తర్వాత పదోన్నతుల ప్రక్రియ చేపడతామనడం సరికాదన్నారు. మరోవైపు సీనియారిటీ జాబితా రూపొందించడంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని, ఉద్యోగ సంఘాల ప్రమేయంతో కౌన్సెలింగ్ ప్రక్రియ ఇష్టారాజ్యంగా కొనసాగుతోందని మండిపడ్డారు.

**కమిషనర్‌తో చర్చలు విఫలం**


ఆందోళన నేపథ్యంలో వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ (సీఎఫ్‌డబ్ల్యూ) ఆర్.వి.కర్ణన్ తన కార్యాలయంలో స్టాఫ్‌నర్సుల ప్రతినిధుల బృందంతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ చేపడతామని కమిషనర్ చెప్పడంతో ససేమిరా అంటూ బయటకు వచ్చేశారు. మధ్యాహ్నం 3గంటలకు హెడ్‌నర్సుల కౌన్సెలింగ్‌ను అడ్డుకునేందుకు ఓఎంసీ కౌన్సెలింగ్ కేంద్రానికి చేరుకోవడంతో అక్కడ గందరగోళ పరిస్థితులకు దారితీసింది. సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో బయటకు వచ్చిన డీహెచ్ డా.రవీందర్‌నాయక్‌ను అడ్డుకుని తమ డిమాండ్లను వివరించగా ప్రస్తుతానికి స్టాఫ్‌నర్సుల బదిలీలు లేవని, ఎప్పుడు నిర్వహిస్తామో తర్వాత సమాచారం ఇస్తామని చెప్పి వెళ్లిపోయారు.

## ట్రైబల్ వెల్ఫేర్ గురుకులంలో డిప్యూటీ సెక్రటరీ పదోన్నతలు పొందిన డి ఎస్ వెంకన్న సార్‌కి అభినందనలు తెలిపిన విద్యార్థి సంఘల నాయకులు

హన్మకొండ ఆర్ సి ఓ కార్యాలయంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ సంధర్భంగా టీజీవిపి రాష్ట్ర కార్యదర్శి మేడ రంజిత్. ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్. బీఎస్‌ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు రాజేందర్ మాట్లాడుతూ, డి ఎస్ వెంకన్న గారు లెక్చరర్ ఎకనామిక్స్ సబ్జెక్టు తో ఉద్యోగం పొంది మొదటగా విశాఖపట్నం గిరిజన ప్రాంతంలో పనిచేసి, భద్రాచలం లో లెక్చరర్ గా పూర్తిగా ఆదివాసులతో సాహసం చేసి, తిరిగి పదోన్నతి పొంది అశోక్ నగర్ బాయ్స్ గురుకులం లో ప్రిన్సిపాల్ గా చేసి కురవి గర్ల్స్ గురుకులంలో చేసి మహబూబాబాద్ లో అమ్మాయిలను చదివించడం లో ముందు వరసలో ఉండి ఎందరో లంబాడి విద్యార్థినిలకు సీట్స్ లు ఇచ్చి చదవడానికి పొత్సహించడం జరిగింది. ఈ విషయాన్ని గవర్నమెంట్ దృష్టిలో పడి మరో సారి పదోన్నతి కల్పించి ఫ్రీ ఎగ్జామ్ ట్రైనింగ్ సెంటర్లో లో ప్రమోషన్ కల్పించినారు.ఆ పోస్ట్ తో ఎంతో గిరిజన విద్యార్థులకు జాబ్ ట్రైనింగ్ ఇప్పించడం తో చాలా మంది విద్యార్థిని విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగం సాధించినారు వరంగల్ అండ్ కరీంనగర్ ఆర్ సి ఓ బాధ్యతలు ఇవ్వడం జరిగింది. వెనుక బడిన వర్గాల పేద విద్యార్థిని విద్యార్థులకు



అదే విధంగా తనదైన శైలిలో పేద విద్యార్థులకు అందించిన సేవలను గుర్తించి ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటి సెక్రటరీ గా ప్రమోషన్ వచ్చినందుకు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో అభినందనలు తెలుపడం జరిగిందిద.



## ప్రజా సమస్యలపై పోరాడిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు గడ్డం యలమంచమ్మ

**– సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి**

హుజూర్నగర్ /గరిడేపల్లి జూలై 20 (వాయిస్ టుడే ప్రతినిధి) నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ప్రజల సమస్యలపై ఎర్రజెండా నాయకత్వంలో పోరాడిన యోధురాలు కామ్రేడ్ గడ్డం యలమంచిమ్మ అని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు. మండలలోని వెలిదండ గ్రామంలోతెలంగాణ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ గడ్డం లక్ష్మి నరసయ్య భార్య గడ్డం యలమంచమ్మ సంతాప సభ యానాల సోమయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తన భర్త గడ్డం లక్ష్మీనారాయణ ప్రత్యక్షంగా పాల్గొనగా ఆయనకు చేదోడు వాదోడుగా ఉంటూ ఆ పోరాటంలో పాల్గొన్న వారికి భోజనాలు పంపుతూ పోరాటానికి ఆమె పరోక్షంగా సహాయ సహకారం అందించడం జరిగింద న్నారు. వెలిదండ గ్రామంలో ఆనాడు జరిగిన దాడులు దౌర్జన్యాలకు వ్యతిరేకంగా గ్రామంలోని మహిళలను కూడగట్టి భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం నిర్వహించిన గొప్ప వ్యక్తి ఆమె అన్నారు. గ్రామంలో సిపిఎం పార్టీ అభివృద్ధికి భార్యాభర్తలు ఇద్దరు కృషి చేశారని అన్నారు కమ్యూనిస్టు ఉద్యమంలో కొనసాగుతూ తుది శ్వాస విడిచారని అన్నారు. సమాజంలో కొంతమంది మాత్రమే చివరి వరకు నమ్మిన సిద్ధాంతం కోసం ఉంటారని అట్లా ఉన్న వారిలో గడ్డం ఎలమంచెమ్మ ఒకరు అని అన్నారు. ఆమె ఆశయాన్ని ముందుకు తీసుకుపోయినప్పుడే ఆమెకు ఘనమైన నివాళి అర్పించిన వాళ్ళం అవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, పారేపల్లి శేఖర్ రావు ,దుగ్గి బ్రహ్మం ,జిల్లా కమిటీ సభ్యులు కొదమగుండ్ల నగేష్, ధనియాకుల శ్రీకాంత్ ,ఎం. ముత్యాలు, సిహెచ్ నరసయ్య రిటైర్డ్ ఉపాధ్యాయులు బంగారయ్య ,వెలిదండ శాఖ కార్యదర్శి కాశయ్య,మండల కమిటీ సభ్యులు బోయిళ్ళ అర్జున్ ,బిక్షం నాయకులు వెంకటయ్య , నందిగామసైదులు, మాజీ సర్పంచి రావులపెంట వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.




**జెడ్ పి హెచ్ ఎస్ మేళ్లచెరువు ఆవరణలో**

## కృషి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన

వాయిస్ టుడేన్యూస్ చింతలపాలెం.మేళ్లచెరువు. ప్రతినిధి: సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల కేంద్రంలో ఉన్నటువంటి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో కృషి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృషి ఫౌండేషన్ చైర్మన్ పోశం నర్సిరెడ్డి, డైరెక్టర్ పోశం వీరారెడ్డి అదేసానుసారం మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దామెర్ల అంజి మాట్లాడుతూ మాదకద్రవ్యాలు తీసుకోవడం వలన గుండె సంబంధిత వ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, గొంతు సంబంధిత వ్యాధులు, అనేక రకాల వ్యాధులు వస్తాయని దాని వలన యువత వాటికి దూరంగా ఉండాలని విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. మరియు పోశం నర్సిరెడ్డి ని ఆదర్శంగా తీసుకొని అతని లాగా ఉన్నత స్థాయికి చేరుకొని మన గ్రామానికి పాఠశాలకు అనేక సేవా కార్యక్రమాలు చేయాలని తెలిపారు. మంద రవి మాట్లాడుతూ ఎంతటి బలవంతమైన చిరుత పులి కూడా మాదకద్రవ్యానికి లోనైతే తన బలాన్ని కోల్పోతుందని అదేవిధంగా యువత కూడా మాదకద్రవ్యాలకు అలవాటు పడితే మన దేశ అభివృద్ధి కుంటుపడుతుందని దేనిలోనూ అభివృద్ధిని సాధించలేరని కావున విద్యార్థులందరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి మంచి విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని తెలిపారు. కృషి ఫౌండేషన్ మునుముందు ఇలాంటి సేవా కార్యక్రమాలకు ముందుంటుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు డిబేటింగ్ నిర్వహించి వారికి బహుమతులు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి, నారపరెడ్డి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు తుపాకీ పేలి కానిస్టేబుల్ దుర్మరణం

**గతంలో ప్రధాని నివాసం వద్ద భద్రతా విధులు**



హైదరాబాద్, అవుకు: ప్రమాదవశాత్తు తుపాకీ పేలి సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ దుర్మరణం చెందారు. తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం బీడీఎల్ ఠాణా పరిధిలో శనివారం జరిగిన ఈ ఘటనపై స్థానిక సీఐ స్వామిగౌడ్ కథనం.. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా అవుకు మండలం జూనుతల గ్రామానికి చెందిన పెట్నికోట వెంకటేశ్వర్లు (32) 2012లో సీఐఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్‌గా చేరారు. 2014లో లక్ష్మీదేవిని వివాహం చేసుకున్నారు. వీరికి పిల్లలు సాయి, సాయిపల్లవి ఉన్నారు. ఏడాదిన్నర క్రితం పటాన్‌చెరు మండలం భానూరు గ్రామపరిధి బీడీఎల్ పరిశ్రమకు బదిలీపై వచ్చి టౌన్‌షిప్ క్వార్టర్స్‌లో నివాసముంటున్నారు. రోజువారీ విధుల్లో భాగంగా శనివారం తెల్లవారుజామున 5.45 గంటలకు సీఐఎస్ఎఫ్ యూనిట్ లైన్ బ్యారక్ వద్ద బస్సు దిగుతుండగా భుజానికి ఉన్న తుపాకీ ప్రమాదవశాత్తు పేలింది. తూటా ఆయన గొంతు నుంచి తలలోకి చొచ్చుకెళ్లి, తల పైభాగం నుంచి బయటకు దూసుకొచ్చింది. అదే వేగంతో బస్సు పైకప్పును కూడా చీల్చుకొని వెళ్లింది. దీంతో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. వెంకటేశ్వర్లు మరణవార్తతో స్వగ్రామం జూనూతలలో విషాదం అలుముకుంది. వీరిది వ్యవసాయ కూలి కుటుంబం. స్థానికంగా సీఐఎస్ఎఫ్ జవానుగా ఎంపికైన తర్వాత దిల్లీలోని వివిధ విభాగాల్లో దాదాపు పదేళ్లు పనిచేశారు. రెండేళ్ల పాటు ప్రధాని నరేంద్ర మోదీ నివాసం వద్ద భద్రతా విధులు నిర్వర్తించారు. రెండేళ్ల కిందటే బదిలీపై పటాన్‌చెరుకు వచ్చిన వెంకటేశ్వర్లు.. ఇలా ప్రమాదవశాత్తు చనిపోవడం విషాదాన్ని నింపింది.